ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 12-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సు తొలిరోజు.. సభ్య దేశాలు న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించాయి.

- ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇకపై వాయిదా వేయలేమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు బ్రిక్స్ సదస్సులో స్పష్టం చేశారు.

- సముద్రయాన కార్మికులకు నావికుల అత్యవసర మద్దతు వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బ్రిక్స్ సదస్సులో ప్రతిపాదించారు.

- హాకీ మహిళల జూనియర్ ఆసియా కప్-2026లో భారత్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది.

===================

భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సు తొలిరోజు.. సభ్య దేశాలు న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించాయి. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న సదస్సులో తొలిరోజు సమావేశం ముగింపులో.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ డిక్లరేషన్‌ను ఆమోదించాలని ప్రతిపాదించారు. ఈ డిక్లరేషన్.. బ్రిక్స్ దేశాల ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని నరేంద్రమోదీ మాట్లాడుతూ చెప్పారు. ఇందులో తీసుకున్న నిర్ణయాలను కార్యరూపంలోకి తీసుకురావడం సభ్య దేశాల ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. మారుతున్న ప్రపంచాన్ని పాతకాలపు సంస్థలతో నడిపించలేమని నేటి చర్చలు స్పష్టం చేశాయని నరేంద్రమోదీ అన్నారు. ప్రాతినిధ్యం, స్పందన, నిబంధనల రూపకల్పనలో సంస్కరణలు అత్యవసరమని ప్రధానమంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్...28 సెకన్లు)

===================

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)లో సంస్కరణలను ఇకపై వాయిదా వేయలేమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు బ్రిక్స్ సదస్సులో మాట్లాడుతూ స్పష్టం చేశారు. ఈ అంశంపై చర్చలకు నిర్దిష్ట కాలపరిమితి, స్పష్టమైన ఫలితాలు ఉండాలన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి ప్రధానంగా దోహదపడుతున్న దేశాలకు.. ప్రపంచ ఆర్థిక పాలనను రూపొందించడంలో తగిన పాత్ర ఉండాలని నరేంద్రమోదీ స్పష్టం చేస్తూ...

(వాయిస్...29 సెకన్లు)

===================

సముద్రయాన కార్మికులకు అవసరమైన సమయంలో సహాయం అందించేందుకు నావికుల అత్యవసర మద్దతు వ్యవస్థ (సీఫేరర్స్ ఎమర్జెన్సీ సపోర్ట్ నెట్‌వర్క్) ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బ్రిక్స్ సదస్సులో ప్రతిపాదించారు. సదస్సు ప్రారంభ ప్రసంగంలో నరేంద్రమోదీ మాట్లాడుతూ.. సముద్రయాన కార్మికులు ప్రపంచ

వాణిజ్యానికి ఎంతో కీలకమైన సేవలు అందిస్తున్నప్పటికీ.. క్లిష్ట పరిస్థితుల్లో వారికి తగిన సహాయం అందడం లేదని ఆయన పేర్కొన్నారు. సంబంధిత దేశాల సముద్ర వ్యవహారాల అధికారులు, దౌత్య కార్యాలయాలను అనుసంధానించడం ద్వారా ఈ నెట్‌వర్క్ సహాయపడుతుందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారత్ అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడి ఈరోజు ఇథియోపియా దేశ ప్రధానమంత్రి డాక్టర్ అబి అహ్మద్ అలీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఉమ్మడి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఇరువురు నేతలు చర్చలు జరిపినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక సహకారం, రక్షణ, భద్రతా భాగస్వామ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాలలో సాధించిన పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. అదే విధంగా ప్రధాని మోదీ మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో కూడా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, ప్రజల మధ్య సంబంధాలతో సహా పలు రంగాలలో ద్వైపాక్షిక సహకార పురోగతిని సమీక్షించారు. ఆసియాన్ (ASEAN)-భారత్ సంబంధాలను బలోపేతం చేయడంలో మలేషియా అందిస్తున్న నిరంతర మద్దతును నరేంద్రమోడి ప్రశంసించారు.

= = = = = = = = = = = = = = = = = = =

సామాజిక అభివృద్ధికి క్రీడలు ఒక ముఖ్యమైన సాధనమని పేర్కొన్న బ్రిక్స్ న్యూఢిల్లీ డిక్లరేషన్.. క్రీడా రంగంలో సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు భారత్ చేసిన రెండు కీలక ప్రతిపాదనలకు మద్దతు తెలిపింది. క్రీడా సాంకేతికతపై వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు, అలాగే క్రీడా వస్తువుల తయారీదారుల కోసం క్రీడా సామాగ్రి తయారీదారుల సదస్సు నిర్వహించాలని భారత్ ప్రతిపాదించింది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

బ్రిక్స్ సదస్సు-2026లో నిర్వహిస్తున్న భారత్ ఇన్నోవేట్స్ ఎక్స్‌పోజిషన్.. ఉన్నత విద్యా, పరిశోధనా సంస్థల్లో రూపుదిద్దుకుంటున్న ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా రూపొందించామని కేంద్ర విద్యాశాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఈ ఎక్స్‌పోకు విచ్చేస్తున్న ప్రముఖులకు స్వాగతం పలకడం దేశానికి గర్వకారణమని సామాజిక మాధ్యమ వేదికగా విడుదల చేసిన  వీడియో సందేశంలో ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో.. భారత్‌లో ఆవిష్కరణల వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భారత్ ఆవిష్కరణల ప్రయాణం ప్రపంచవ్యాప్తంగా ప్రభావాన్ని చూపుతోందని ప్రహ్లాద్ జోషి పేర్కొంటూ...

(వాయిస్...23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీసగఢ్‌లోని రాయ్‌గఢ్‌లో నిర్మించిన ప్రపంచంలోనే పొడవైన స్టీల్ స్లాగ్ రోడ్డు గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకుంది. మొత్తం 1.85 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి.. ఉక్కు తయారీలో ఉప ఉత్పత్తిగా లభించే ప్రాసెస్ చేసిన స్టీల్ స్లాగ్‌ను రోడ్డు నిర్మాణంలో ఉపయోగించే కంకరగా మార్చే స్వదేశీ సాంకేతికతకు నిదర్శనంగా నిలిచింది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డు ధ్రువీకరణ కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడారు. స్టీల్ స్లాగ్ రోడ్ టెక్నాలజీతో రహదారి నిర్మాణ వ్యయాన్ని సుమారు 40 శాతం వరకు తగ్గించవచ్చని, సంప్రదాయ రోడ్లతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ బలం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) రేపు అన్ని మెట్రో మార్గాల్లో ఉదయం 6 గంటల నుంచే సర్వీసులను ప్రారంభించనుంది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు సకాలంలో, సౌకర్యవంతంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎంఆర్‌సీ ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించింది. విద్యార్థులు, ప్రయాణికులు తమ ప్రయాణాన్ని అందుకు అనుగుణంగా ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని డీఎంఆర్‌సీ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

హాకీ మహిళల జూనియర్ ఆసియా కప్-2026లో భారత్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. చైనాలోని మోకీలో ఈరోజు జరిగిన సెమీఫైనల్‌లో దక్షిణ కొరియాపై భారత్ 5-1 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. రెండో సెమీఫైనల్‌లో చైనా, జపాన్ మధ్య జరిగే మ్యాచ్ విజేతతో భారత్ ఫైనల్‌లో తలపడనుంది. 2023, 2024లో వరుసగా టైటిళ్లు సాధించిన భారత్.. మూడో టైటిల్ కోసం ఈ బరిలో నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఆఫ్గానిస్థాన్ పురుష జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ-20 క్రికెట్ సిరీస్ రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో తొలి టీ-20 మ్యాచ్ జరగనుంది. సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లూ ఇదే వేదికలో జరుగుతాయి. అఫ్గానిస్థాన్‌తో ఇప్పటివరకు ఆడిన తొమ్మిది టీ-20 మ్యాచ్‌ల్లో భారత్ ఎనిమిది విజయాలు సాధించింది. ఒక మ్యాచ్ ఫలితం తేలకుండానే ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్, చైనా మధ్య విమాన ప్రయాణ సంబంధాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21వ తేదీ నుంచి గ్వాంగ్‌జౌ నుంచి న్యూఢిల్లీకి సాధారణ ప్రయాణికుల విమాన సర్వీసులను పునఃప్రారంభించనున్నట్లు చైనా సదరన్ ఎయిర్‌లైన్స్ ఈరోజు ప్రకటించింది. దాదాపు ఆరు సంవత్సరాల విరామం తర్వాత ఈ సర్వీసులు తిరిగి ప్రారంభం కానున్నాయి. 2020లో కోవిడ్-19 మహమ్మారి ప్రారంభమైన తర్వాత భారత్, చైనా మధ్య విమాన సర్వీసులు నిలిచిపోయాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వస్తున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది మార్చిలో భారత విమానయాన సంస్థ ఇండిగో.. షాంఘై, కోల్‌కతా మధ్య రోజువారీ విమాన సర్వీసులను ప్రారంభించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

యూదుల నూతన సంవత్సరం రోష్ హషానా సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇజ్రాయెల్ ప్రజలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూదు సమాజానికి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరికీ శాంతి, మంచి ఆరోగ్యం, నిరంతర పురోగతిని అందించాలని ఆయన ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =